సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 2 । మార్చి । 2024



రూ.51 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి సలాది శ్రీనివాస్ దంపతులు (కపిలేశ్వరపురం) శుక్ర వారం రూ.51 వేల విరాళం సమర్పించారు.



రామకృష్ణారెడ్డివి 'ఉనికి'పాట్లు

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉనికి చాటుకోవడానికే అనేక ఫీట్లు చేస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు.

II లో

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్ర వారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇం దులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కోసం 'ర్యాంపు'



సర్వేకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసి నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: సూక్ష్మ చిన్న,మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)ల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచబ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం 'పనితీరును మెరుగుపరిచి వేగవంతం చేయడం' అనే (ర్యాంపు) స్కీమ్‌ను ప్రకటించిందని జేసీ ఎస్.నుపూర్ అజయ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సర్వేకి సంబంధించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఈ సర్వే స్కీములు గత నెల 14వ తేదీన ప్రారంభించి అదే రోజున ఏపీ ఎంఎస్‌ఎంఈ వన్ అనే ఏకీకృత పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. జిల్లాలోని అన్ని ఎంఎస్‌ఎంఈలను సర్వే చేయడం కోసం ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సర్వే ద్వారా తయారీ, సేవ వాణిజ్య రంగాల్లో ఎంఎస్‌ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకువచ్చి పోర్టల్‌కు అనుసంధానిస్తారన్నారు. సర్వే 20వ తేదీ వరకు నిర్వహిస్తారని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేసీ ప్రసాద్ పాల్గొన్నారు.

6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఈఓ బళ్ల నీలకంఠం శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఆరో తేదీ రాత్రి స్వామి వారి కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, దీక్షాధారణ, మధ్యాహ్నం నంది వాహనంతో పట్టణంలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, రాత్రి ధ్వజారోహణ అనంతరం ఆలయం వద్ద పార్కులో ప్రత్యేక వేదికపై కల్యాణం నిర్వహిస్తారు. ఏడో తేదీ ఉదయం స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరుపుతారు. ఎనిమిదో తేదీ మహా శివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి ఒంటి గంట నుంచి స్వామివారి మూలవిరాట్ వద్ద అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 10 నుంచి 12.15 గంటల వరకూ స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాల పూజ జరుపుతారు. దాతల సహకారంతో భక్తులకు పాలు, మజ్జిగ, అల్పాహారం, భోజనాల ఏర్పాట్లకు అనుమతిస్తామని ఈఓ తెలిపారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామన్నారు. తొమ్మిదో తేదీ ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, మధ్యాహ్నం 3.20 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు. పదో తేదీ ఉదయం త్రిశూల స్నానం, 11 గంటలకు తీర్థపు సేవ ఉంటాయని చెప్పారు. 11వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని నీలకంఠం వివరించారు.

జాతీయ రయ్‌దారులు

- కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు దాదాపు పూర్తి
- వినియోగంలో ముమ్మిడివరం, అమలాపురం బైపాస్‌లు
- రాజోలు బైపాస్ 80 శాతం పూర్తి
- రూ.580 కోట్లతో నర్సాపురం– సఖినేటిపల్లి మధ్య వంతెన
- గతంలో మూడుసార్లు శంకుస్థాపనలు
- నాడు నిధులు ఇవ్వని చంద్రబాబు
- పట్టుబట్టి నిధులు సాధించిన సీఎం జగన్



వినియోగంలోకి వచ్చిన అమలాపురం వద్ద 216 బైపాస్ రోడ్డు



80 శాతం నిర్మాణం పూర్తయిన రాజోలు బైపాస్ రోడ్డు

సాక్షి అమలాపురం: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిధులు సాధించడం... రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని సేకరించి జాతీయ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (ఎన్‌హెచ్)కు అప్పగించడంతో పనులు వేగంగా పూర్తవుతున్నాయి. కత్తిపూడి– ఒంగోలు విస్తరణ పనులు, రాజోలు దీవి వాసుల చిరకాల స్వప్నం సఖినేటిపల్లి వద్ద వశిష్ఠ నదిపై మరో వంతెన నిర్మాణం, మలికిపురం మండలం శివకోడు వద్ద నుంచి నర్సాపురం వరకు బైపాస్ నిర్మాణ పనులను ఎన్‌హెచ్ చేపట్టింది. ఈ పనులన్నీ జిల్లాలో వేగంగా సాగుతున్నాయి.

కత్తిపూడి–ఒంగోలు మధ్య ఉన్న జాతీయ రహదారి 216ను కేంద్ర ఉపరితల రవాణా శాఖ విస్తరిస్తోంది. ఈ పనులు గత ప్రభుత కాలంలో ఆరంభం కాగా పనులు నత్తను తలపించాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూ సేకరణ, హైవే విస్తరణ పనులు జోరందుకున్నాయి. ఎన్‌హెచ్ 216 రోడ్డు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వారధి వద్ద నుంచి మొదలై ముమ్మిడివరం, అమలాపురం, తాటిపాక, రాజోలు, శివకోడు, దిండి వరకు ఉంది. సుమారు 374 కిలోమీటర్ల నిడివి ఉన్న ఈ రహదారి విస్తరించడంతోపాటు ప్రధాన పట్టణాలలో బైపాస్ రోడ్ల నిర్మాణాలకు, కల్వర్టులు, వంతెనలు, రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణాలకు, విస్తరణ, కొత్త ప్రాంతాల్లో రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు జాతీయ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ సుమారు రూ.4 వేల కోట్లను కేటాయించింది. విస్తరణలో భాగంగా ముమ్మిడివరం, అమలాపురం, తాటిపాక, రాజోలు వద్ద బైపాస్ రోడ్ల నిర్మాణాలు చేయాల్సి ఉంది. వీటిలో ముమ్మిడివరం, అమలాపురం బైపాస్ రోడ్ల నిర్మాణాలు పూర్తికావడంతోపాటు వినియోగంలోకి వచ్చాయి. మామిడికుదురు మండలం పాశర్లపూడి నుంచి మొదలై రాజోలు మండలం శివకోడు వరకు నిర్మిస్తున్న రాజోలు బైపాస్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అక్కడక్కడా చిన్నచిన్న వంతెనల నిర్మాణాలు జరగాల్సి ఉండగా పనులు వేగంగా సాగుతున్నాయి. మొత్తం బైపాస్ పూర్తి కాకున్నా పలుచోట్ల వాహన చోదకులు దీనిని వినియోగిస్తుండడం విశేషం. ఈ బైపాస్ వినియోగంలోకి వస్తే జిల్లాలో 216 జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపుగా పూర్తయినట్టే. ఈ బైపాస్ వల్ల జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు జోరందుకున్నాయి.

నర్సాపురం– సఖినేటిపల్లి వంతెనకు మోక్షం

ఉమ్మడి ఉభయ గోదావరి జిలాలను కలుపుతూ గోదావరిపై సఖినేటిపల్లి– నర్సాపురం మధ్య వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా జాతీయ రహదారి 216 బైపాస్ రహదారిలో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి రూ.580.42 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఎన్‌హెచ్ గత ఏడాది ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో రూ.194 కోట్లతో ఈ వంతెన నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2008 ఏప్రిల్ 16న శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ మృతి తరువాత దీని వంక చూసిన వారు లేరు. 2014 నుంచి 2019 వరకు సీఎంగా ఉన్న చంద్రబాబు నిధుల కేటాయింపులో మొండిచేయి చూపించారు. గతంలో ఈ వంతెనకు మూడుసార్లు శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే.

వంతెన, రహదారి నిర్మాణాలకు నిధులు

శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా నర్సాపురం వరకు బైపాస్ నిర్మించాలని సీఎం జగన్ కేంద్ర ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. సుమారు 22.17 కిలోమీటర్లు ఉన్న ఆర్‌అండ్‌బీని హైవేగా మార్పు చేయాలని కోరగా అందుకే గడ్కరీ అంగీకరించారు. దీనిలో భాగంగానే రామరాజులంక వద్ద వశిష్ఠపై 380 మీటర్ల మేర వంతెన నిర్మించనున్నారు. వంతెన, రహదారి నిర్మాణాలకు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరు చేశారు. కిలోమీటరుకు రూ.26.18 కోట్లు అవుతుందని లెక్కలు కట్టిన ఎన్‌హెచ్ నిధులు మంజూరు చేసింది. జిల్లా వాసులు విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు రావులపాలెం చేరుకుని ఎన్‌హెచ్–16 మీద రాకపోకలు సాగిస్తుంటారు. రాజోలు దీవితోపాటు అమలాపురం, ముమ్మిడివరం వాసులు విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు నర్సాపురం, మొగల్తూరు, పెడన, మచిలీపట్నం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. శివకోడు నుంచి నర్సాపురం రహదారి పూర్తయితే వీరికి మరింత మేలు జరుగుతుంది.

వంతెన నిర్మాణంలో ముందడుగు



కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సఖినేటిపల్లి– నర్సాపురం మధ్య రహదారి నిర్మాణంలో భాగంగా రామేశ్వరం– రాజుల్లంక మధ్య గోదావరిపై వంతెన నిర్మాణం కానుంది. గతం కంటే మెరుగయిన ప్రతి పాదనలతో జాతీయ రహదారికి బైపాస్‌గా మారి ఈ వంతెన నిర్మాణం జరగనుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధితో పాటు, ప్రజల రవాణాకు కూడా చాలా అవసరం. తొలి విడతలోనే రూ.65 కోట్లు విడుదల అయి, భూసేకరణ పూర్తి కావడం వంతెన నిర్మాణంలో కీలక ఘట్టం.

– పాటి శివకుమార్, రామేశ్వరం

తొలగనున్న ట్రాఫిక్ కష్టాలు



216 జాతీయ రహదారిలో భట్నవిల్లి – పేరూరు మధ్య బైపాస్ రోడ్డు నిర్మాణంతో అమలాపురంలో ట్రాఫిక్ కష్టాలకు మోక్షం కలిగింది. అమలాపురంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బైపాస్‌రోడ్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్మించడంతో ప్రజలకు మైరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. పేరూరు భట్నవెల్లి గ్రామాలకు 15 నిమిషాల్లో వెళ్లే సౌకర్యం ఏర్పడింది.

– ఉబ్బన శ్రీనివాస్, అమలాపురం

రాజేష్ అభ్యర్థిత్వంపై పునరాలోచన చేయాలి

పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఎస్సీ నేతలు



నగరం సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ నేత సుబ్బారావు

మామిడికుదురు: పి.గన్నవరం టీడీపీ అభ్యర్థి సరిపెళ్ల రాజేష్ అభ్యర్థిత్వంపై పార్టీ పునరాలోచన చేయాలని టీడీపీకి చెందిన ఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో శుక్రవారం పార్టీ సీనియర్ నేత జాలెం సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ ఎస్సీ నేతల సమావేశం జరిగింది. స్థానికేతరుడైన రాజేష్‌ను వివాదాస్పదమైన వ్యక్తిగా, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే వ్యక్తిగా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని సుబ్బారావు పేర్కొన్నారు. రాజేష్‌ను అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించిన నాటి నుంచి నియోజకవర్గంలో గందరగోళం నెలకొందన్నారు. అభ్యర్థి విషయమై టీడీపీ, జనసేనలు పునరాలోచన చేయాలన్నారు. రాజేష్ గో బ్యాక్, స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. నగరం సర్పంచ్ జాలెం రమణ కుమారి, మాజీ సర్పంచ్ గోగి రమేష్, పార్లమెంటు ప్రధాన కమిటీ సభ్యులు నక్కా సత్యనారాయణ, పి.గన్నవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉండ్రాజవరపు ప్రభుదాసు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెదపూడి రాము, ఎస్సీ నేతలు జాలెం వెంకటేశ్వరరావు, జాలెం రాజేష్, కొల్లాబత్తుల బాబూరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

4న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఉద్యోగాన్ని బట్టి భోజనం, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు.

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీడీ ముకుందరావు

ముమ్మిడివరం: వరి సాగులో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించగలిగితే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ శాఖ అదనపు డీడీ డాక్టర్ బి.ముకుందరావు అన్నారు. ముమ్మిడివరం ఏరువాక కేంద్రంలో శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయ సంఘ సమావేశం జరిగింది. తొలుత డాక్టర్ బి.భవాని 2023–24లో చేపట్టిన వ్యవసాయం, విస్తరణ ప్రగతిని, నూతన వరి వంగడాల ప్రదర్శనా క్షేత్రాలు, సార్వా, దాళ్వా సాగుపై నివేదికను వివరించారు. ముకుందరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు మాట్లాడుతూ ఖరీఫ్ కాలానికి అనువైన స్వల్ప, మధ్య కాలిక, రకాలను రైతులు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పీబీ ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు, షంశీ, రాజశేఖర్ రామ్‌మోహన్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బాటలు

- ఎంపీ చింతా అనురాధ
- 33,502 మందికి జగనన్న విద్యా దీవెన నిధులు
- తల్లులు, విద్యార్థుల ఉమ్మడి ఖాతాలకు రూ.25.80 కోట్ల జమ



జగనన్న విద్యా దీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందని ఎంపీ చింతా అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం జగనన్న విద్యా దీవెన పథకం నిధులు సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు బహిరంగ సభలో బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ అకౌంట్లోకి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి లైవ్ లింక్ ద్వారా ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు వీక్షించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన లబ్ధిదారులకు మెగా చెక్కును ఎంపీ అనురాధ అందించారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడి ఉద్యోగాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తోందన్నారు. ఆ దిశగా రాష్ట్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులు కాలేజీలకు చెల్లించవలసిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి జగనన్న విద్యాదీవెన కింద నిధులు తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా జమ చేస్తోందన్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, నాడు – నేడు కింద పాఠశాలల రూపురేఖలను మార్చడం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ఎనిమిదో తరగతి విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు అందించడం వంటి పథకాల ద్వారా ప్రాథమిక విద్యను ప్రోత్సహిస్తోందని, ఉన్నత విద్యలో జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన తదితర పథకాలు అమలు చేస్తూ విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ మాట్లాడుతూ అక్టోబర్ –డిసెంబర్, 2023 త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో 8,824 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.6,14,77,716, 188 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.11,30,514, బీసీ విద్యార్థులు13,413 మందికి రూ.10,06,46,912, ఈబీసీ విద్యార్థులు 2,343 మందికి రూ.2,22,45,936, మంది కాపు విద్యార్థులు 8,275 మందికి రూ.6,85,18,007, ముస్లిం మైనారిటీ విద్యార్థులు 319 మందికి రూ. 28,18,780, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు 140 మందికి రూ.11,94,165 అందించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 33,502 మంది విద్యార్థులకు రూ.25,80,31,958 జగనన్న విద్యా దీవెన పథకం కింద తల్లులు, విద్యార్థుల జాయింట్ అకౌంట్ లోకి సీఎం జగన్ బటన్ నొక్కి జమ చేశారన్నారు. ఈ నిధులను వారం, పది రోజుల లోపు కాలేజీలకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశీ బాల మునికుమారి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీ హరిరామ్‌గోపాల్, గెడ్డం సంపతరావు, అల్లవరం ఎంపీటీసీ సభ్యుడు పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నేను అమలాపురం ఎస్‌కేబీఆర్ ఆర్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుకుంటున్నా. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా కాలేజీ, మెస్ ఫీజులు ప్రభుత్వం చెల్లించడం ఆనందంగా ఉంది. ఈ పథకాలు నాలాంటి పేదలకు సహాయపడతాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– వినోద్

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రానికి వడివడిగా వస్తున్న విద్యార్థినులు



పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

రాయవరం: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షలు ప్రారంభమై 12గంటలతో ముగిశాయి. అధికారులు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా విద్యార్థులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా పరీక్షలు రాశారు. సీసీ కెమెరాల నిఘా నీడలో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు పలువురు విద్యార్థులు ఉదయం 8గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షా కేంద్రంలో తమకు ఏ గదిని కేటాయించారోనని ఆతృతగా తెలుసుకునే ప్రయత్నం చేశారు. జిల్లాలో 13 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలలుండగా, 90 వరకు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన 14,490 మంది జనరల్ ఒకేషనల్ విద్యార్థులు తెలుగు/సంస్కృతం పరీక్షలు రాయాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా కేటాయించిన 38 పరీక్షా కేంద్రాల్లో 13,720 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 770 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు జిల్లా పరీక్షల కమిటీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది. జిల్లాలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఇంటర్ బోర్డు డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పేదలకు ఆపద్బాంధవి సీఎం సహాయ నిధి

- మంత్రి విశ్వరూప్
- రూ.ఐదు లక్షల చెక్కు అందజేత



చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం రూరల్: పేద ప్రజలకు ఆపద్బాంధవిగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోందని, ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ఉపయోగమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందిన అమలాపురం పట్టణం 23 వార్డు నారాయణపేట కి చెందిన కల్లపల్లి కృపా రాజశేఖర్‌కి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరయిన రూ.5 లక్షల చెక్కును క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు మంత్రి విశ్వరూప్ శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అట్టడుగువర్గాలు, తెల్లకార్డు దారులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. వ్యాధిగ్రస్తులు తమ దరఖాస్తులను మండల తహసీల్దారు ద్వారా కలెక్టర్‌కు పంపితే సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి ఆయన సిఫారసు చేస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో వ్యాధుల సంఖ్యను పెంచి రూ.25 లక్షల విలువ గల చికిత్సలను అందిస్తూ పథకాన్ని ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించని కేసులకు సంబంధించి రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని) సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉండ్రు బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్, ఈతకోట శ్రవణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాలుగు కేజీల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

గోపాలపురం: అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖ జిల్లా నుంచి హైదరాబాద్ వెళుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరి బ్యాగుల్లో నాలుగు కేజీల గంజాయి బయటపడినట్లు తెలిపారు. వీరు పోలీసుల కళ్లు గప్పి వాహనాలు మారుతూ పోలీసులకు చిక్కకుండా చెక్‌పోస్టు దగ్గరలో వాహనాల నుంచి దిగిపోయి చెక్‌పోస్టు దాటిన తర్వాత మరో వాహనంలో ఎక్కుతూ ప్రయాణిస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ దాడుల్లో సివిల్ సప్‌లై డీటీ ప్రదీప్‌కుమార్, వీఆర్వోలు నాగలక్ష్మి, మురళీకృష్ణ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ జగదీష్

గోపాలపురం మండలంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తలుపులమ్మను దర్శించుకున్న సినీనటుడు అల్లరి నరేశ్



అల్లరి నరేశ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న లోవ ఉద్యోగులు

తుని రూరల్: ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేశ్ తలుపులమ్మ అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దేవస్థానానికి సన్నిహితులతో వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వదించారు. అల్లరి నరేశ్‌కు లోవ దేవస్థానం ఉద్యోగులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అన్నవరం: సినీ నటుడు అల్లరి నరేష్ శుక్రవారం రత్నగిరి పై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు.

పరిహారం ఇవ్వాల్సిందే

- ఓఎన్‌జీసీ పనులు అడ్డుకున్న మత్స్యకారులు
- ఏటిమొగ వద్ద కార్యకలాపాల అడ్డగింపు
- హామీ ఇచ్చేవరకు తగ్గేది లేదని అల్టిమేటం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం

కాకినాడ: ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన గళం విప్పారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ ప్రాంత మత్స్యకారులకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమిస్తామంటూ అల్టిమేటం ఇచ్చారు. దీంతో ఓఎన్‌జీసీ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళ్తే... ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి చమురు సంస్థలు సముద్రంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు వెలికితీసే పనులను సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్నాయి. సదరు సంస్థల కార్యకలాపాల నేపథ్యంలో సముద్ర వేటనే జీవనాధారంగా చేసుకున్న మత్స్యకారుల ఉపాధికి భంగం కలుగుతోంది. దీంతో తాళ్ళరేవు, భైరవపాలెం సహా పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 65 మత్స్యకార గ్రామాలకు చమురు సంస్థలు పరిహారాన్ని అందిస్తున్నాయి. అయితే కాకినాడ ఏటిమొగ ప్రాంతం మీదుగా కార్యకలాపాలు కొనసాగిస్తూ తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఎన్నో ఏళ్లుగా ఇక్కడి మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎటువంటి న్యాయం జరగని పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది.



మత్స్యకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు నిలువరించిన ఓఎన్‌జీసీ పైపులు

పనులు అడ్డగించిన మత్స్యకారులు

చమురు సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా ఆగ్రహంతో రగిలిపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులు శుక్రవారం నిరసన గళం విప్పారు. సముద్రగర్భంలోకి పైపులైన్లను తరలిస్తున్న సమయంలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఓఎన్‌జీసీకి చెందిన వాహనాలను మత్స్యకారులంతా అడ్డుకున్నారు. బార్జిపైకి పైపులైన్లు తరలిస్తున్న సమయంలో అక్కడ బార్జిలు, ఇతర వాహనాలను నిలుపు చేసి పరిహారం ఇవ్వాల్సిందేనంటూ నినదించారు. ఆ నోటా, ఈ నోటా విషయం పాక్కడంతో వందలాది మంది మత్స్యకారులు అక్కడికి తరలివచ్చి నిరసన కొనసాగించారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం

స్థానిక మత్స్యకారుల ద్వారా సమాచారం తెలుసుకున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మద్దతు ప్రకటించారు. ఈ ప్రాంత మత్స్యకారుల న్యాయసమ్మతమైన డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు పరిహారం ప్రకటించేవరకు తాను కూడా పోరాడతానని హామీ ఇచ్చారు. 2009 నుంచి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంత మంది రాజకీయ నాయకుల స్వార్థం వల్ల న్యాయం జరగలేదన్నారు. సముద్రంలో రిగ్ కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతంలో ఇక్కడి మత్స్యకారులు కూడా వేటకోసం వెళ్తారని, అలాంటప్పుడు వీరికి పరిహారం ఇవ్వడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. ఈ విషయమై మత్స్యకారులు, మత్స్యకార ప్రతినిధులు, ఓఎన్‌జీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అప్పటి వరకు పనులు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏటిమొగ రేవు కాల్వ వద్ద మత్స్యకారులు టెంట్‌లు ఏర్పాటు చేసి నిరసన కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు, మత్స్యకార ప్రముఖులు కాటాడి జానికిరామ్, స్థానిక నాయకులు, స్థానిక మత్స్యకార పెద్దలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డివి ఉనికిపాట్లు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం
- మాజీ ఎమ్మెల్యే తీరును ఎండగట్టిన ఎమ్మెల్యే

అనపర్తి: రాజకీయంగా నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారవుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన ఉనికిని చాటుకోవడానికే అనేక పాట్లు...ఫీట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాళ్ల ప్రతి సవాళ్లతో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం తనకు మద్దతుగా నియోజకవర్గంలోని పెదపూడి, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల నుంచి తన స్వగృహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అబద్దాలు మాట్లాడడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటేనన్నారు. అనపర్తి రాజకీయ చరిత్రలో అవినీతి సామ్రాట్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే తన నలుపు తాను చూసుకోకుండా, నేను అవినీతికి పాల్పడ్డానంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా రామకృష్ణారెడ్డి తన అవినీతితో నియోజకవర్గాన్ని పీల్చి పిప్పి చేశారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే అవినీతి చిట్టాను ఆయనకు ముడుపులు చెల్లించిన వారే స్వయంగా ఆడియో, వీడియోల రూపంలో వెల్లడించారని, అయితే ఆయన ఏనాడూ వాటిని ఖండించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. అవినీతికి పాల్పడ్డానంటూ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనపై వెయ్యి రాళ్లు విసిరినా ఒక్కటి కూడా తనను తాకలేదని అన్నారు. నర్సింగ్‌హోం వద్ద తాను లేనన్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తనపై ముద్రించిన కరపత్రాన్ని తీసుకుని అక్కడకు వచ్చి సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి రామవరం ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆయన చర్చకు సిద్ధమని నేను ప్రకటించినప్పటికీ శుక్రవారం అనపర్తి రాలేకపోవడమేమిటని ప్రశ్నించారు.



వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యేకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

విషయాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రామా

అనపర్తి వస్తే ఏమి జరుగుతుందో రామకృష్ణారెడ్డికి తెలుసని, పబ్లిసిటీ స్టంట్ సృష్టించడంలో ఆరితేరిన మాజీ ఎమ్మెల్యే విషయాన్ని పక్కదారి మళ్లించేందుకు హైడ్రామా సృష్టించే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. పసలేని ఆరోపణలు చేస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని సర్వే సంస్థలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని వెల్లడిస్తున్నాయని, టీడీపీకి అనుకూలంగా పనిచేసే సర్వే సంస్థలు సైతం అనపర్తిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయం సాధిస్తారన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. రాజకీయంగా ప్రజా మద్దతును కోల్పోయిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజల్లో సానుభూతిని పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే కలలు కల్లలు గాక తప్పదని అన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే స్పందిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అనపర్తి పరిసర గ్రామాలకు చెందిన దాతలు ఇచ్చిన విరాళాలు, వాటిని ఏవిధంగా వినియోగించినది ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. రాబోయే ఎన్నికలో కురుక్షేత్రంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే తనపై చేసిన అవినీతి ఆరోపణలు ఖండించడంతోపాటు తనకు మద్దతు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కొత్తపేట: ప్రతి విద్యార్థిలో ఉండే సృజనాత్మకత, వినూత్న ఆలోచనలకు పదును పెట్టడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ) జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన వారు ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం గోపాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈవో, ఏపీసీ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్పాదకత వైపు మళ్లించడం కోసం ప్రభుత్వం ఈఎండీపీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఈఎండీపీ జోనల్ మేనేజరు యనమదల నవ్యలు మాట్లాడుతూ జిల్లాలో 224 ఉన్నత పాఠశాలల్లో ఈఎండీపీ కార్యక్రమం గతేడాది జూన్ నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో13వేల మంది తొమ్మిదవ తరగతి విద్యార్థులు శిక్షణ పొందారన్నారు.10 ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతురావు, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, మండల విద్యాశాఖాధికారి మట్టపర్తి హరిప్రసాద్ మాట్లాడారు. మండపేట శ్రీగౌతమి ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన హోమ్ సర్వీస్ ఎక్స్‌పర్ట్, అమలాపురం మండలం పాలగుమ్మి ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన పర్యాటక ప్రదేశాల కోనసీమ యాప్ రాష్ట్ర ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. జెడ్పీహెచ్ఎస్ జి.అగ్రహారం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల అమలాపురం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కొత్తపేట విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా బొమ్మూరు డైట్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతురావు, సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ బండారు సీతారామ్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు క్రిష్టోఫర్, శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రాజెక్టుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీవో కమలకుమారి, ఏపీసీ మధుసూదనరావు తదితరులు

హత్యాయత్నం కేసులో ఎంపీటీసీ సభ్యుడి అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో కాంట్రాక్టర్ కొత్తపల్లి సుబ్రహ్మణ్యంపై హత్యాయత్నం చేసిన అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు అడపా సత్తిబాబును గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ సీఐ క్రిష్టోఫర్ తెలిపారు. తన భార్యతో వివాహేతరం సంబంధం కలిగి ఉన్నాడన్న అనుమానంతో సత్తిబాబు తన వసతి గృహం డాబాపై పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న కాంట్రాక్టర్ సుబ్రహ్మణ్యంపై పట్టా కత్తితో గత నెల 28వ తేదీన హత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే.

జీఎస్‌టీ ఎగవేసిన షాపులపై కేసులు

రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/నిడదవోలు రూరల్: షాపులు నిర్వహించే యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకు జీఎస్‌టీ కట్టకుండా ఎగవేసిన, డొమెస్టిక్ (గృహ) గ్యాస్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం కేవీఆర్ స్వామి రోడ్డులో గల రాజ్ గురు స్పేర్స్‌లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్ గురు స్పేర్స్ షాపుకు సంబంధించి నాలుగు ప్రదేశాలలో స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. ఇందులో రూ.1,52,41,352/- విలువైన మొత్తం 10,805 వస్తువులు కనుగొనమన్నారు. కొన్ని ప్యాకేజీలపై ఎంఆర్‌పీ లేని విషయం గుర్తించామన్నారు. స్టాక్ రిజిష్టర్‌లు నిర్వహించకపోవడం గుర్తించామని, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌ల ఫైల్‌ను స్వాధీనపరుచుకున్నారని తెలిపారు. షాపు ఐదు కేసులు నమోదు చేశారని వివరించారు. నిడదవోలు మండలం గోపవరంలోని 'టి-కేఫ్ హోటల్'లో డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు వాడడం గుర్తించామన్నారు. యజమాని దొడ్ల చిన్న మల్లయ్య పై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు ముత్యాలునాయుడు, శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పాల్గొన్నారు.


వేలం నిర్వహించే ఆస్తుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఈ వేలం నిర్వహించే 45 ఆస్తుల వివరాల ఫొటో ప్రదర్శన ఇండియన్ బ్యాంక్ జోనల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు జోనల్ మేనేజర్ సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శన తిలకించేందుకు శుక్రవారం 35 మంది ఔత్సాహికులు తరలివచ్చారని, శనివారం సైతం ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రికవరీ టీం చీఫ్ మేనేజర్ దీపక్ కుమార్, జాయ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జోనల్ మేనేజర్ సుధాకరరావు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాహుల్ మృతదేహం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బచ్చల రాహుల్(27) మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బచ్చల రాహుల్, సర్పవరం గ్రామానికి చెందిన అతని బంధువు బళ్ల సునీల్ ఇరువురు బైక్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా కోరంగి వంతెన దిగువన ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాహుల్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. కొన ఊపిరితో ఉన్న రాహుల్‌ను బతికించేందుకు ఇద్దరు యువకులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. కాగా మరొక యువకుడు సునీల్‌కు కాలు విరిగిపోయింది. పలుచోట్ల గాయాలు కావడంతో రక్త స్రావమైంది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ప్రమాదం జరగడంతో రహదారిపై పడిఉన్న సునీల్ రోడ్డు కాలిపోతుంది, బాధ భరించలేకున్నాను అంటూ వాపోయాడు. తనను ఆస్పత్రికి తీసుకువెళ్లండి, ఎలాగైనా బతికించండి అంటూ బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేనకు మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసరావు రాజీనామా

ఈ నెల 5న 200 మందితో వైఎస్సార్ సీపీలో చేరేందుకు నిర్ణయం



కొత్తపేట: మండల పరిధిలోని వానపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ఆ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని పొత్తు కుదుర్చుకున్న టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావును ప్రకటించడాన్ని నిరసిస్తూ జనసేన నుంచి బయటకు వచ్చినట్లు వానపల్లి గ్రామ జనసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టిక్కెట్లు ప్రకటనకు నాలుగురోజుల ముందు కొత్తపేట నియోజకవర్గ టిక్కెట్ మీదేనని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావుకు హామీ ఇచ్చి, తీరా టీడీపీకి కేటాయించి శ్రీనివాసరావుకు తీవ్ర అన్యాయం చేసి, అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కనీసం మూడోవంతు స్థానాలు కూడా తీసుకోకుండా కేవలం 24 స్థానాలతో సరిపెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. కాపు, బడుగు, బలహీనవర్గాలను పవన్ కళ్యాణ్ ఉద్ధరిస్తారని నమ్మి ఆ పార్టీలో ప్రయాణం చేశామని అయితే టీడీపీ అధినేత చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారని విమర్శించారు. జనసేనను చంద్రబాబు ఒక పథకం ప్రకారం అణచివేస్తున్నారని, ఈ విషయాన్ని పవన్‌కళ్యాణ్ గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంకా జనసేనలోనే పనిచేయడం కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టేనని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి, సేవాదృక్పథంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి మద్దతుగా వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 5న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో సుమారు 200 మందితో ఆ పార్టీలో చేరుతున్నట్టు శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

- 7నెలలుగా మార్చురీలో ఫ్రీజర్ పనిచేయని వైనం
- ఐస్ తెచ్చుకుని మృతదేహాలను భద్రపరచుకుంటున్న బంధువులు

యానాం: యానాం-దరియాలతిప్ప రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నియోజకవర్గ పరిధిలోని కురసాంపేటకు చెందిన అరదాడి నూకరాజు, మేడా రాంబాబు సావిత్రినగర్ వైపు మార్కెట్‌కు బైక్‌పై వెళుతుండగా దరియాలతిప్ప నుంచి వస్తున్న అదే గ్రామానికి చెందిన రేవు మల్లీశ్వరరావు బైకు దొమ్మేటిపేట యానాం స్టీల్స్ ఫ్యాక్టరీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అరదాడి నూకరాజు(45)తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా మేడా రాంబాబు, రేవు మల్లీశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు అరదాడి నూకరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా యానాం జీజీహెచ్‌లో మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్ ఏడు నెలల నుంచి పనిచేయకపోవడంతో మృతుని బంధువులు ఐస్ తెచ్చుకుని భద్రపరుచుకుంటున్నారు. ఒక్కోసారి ఓల్డేజ్‌హోమ్‌నుంచి ఫ్రీజర్‌బాక్స్‌లను తెచ్చుకుంటూ మృతదేహాలను భద్రపర్చుకుంటున్నారని ఈ సమస్యను ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరారు. అరదాడి నూకరాజు మృతదేహాన్ని సైతం ఐస్ తెచ్చుకుని భద్రపరిచారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పైడిపర్తి సత్యసాయిబాబా(59) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. రోజువారీ విధుల్లో భాగంగా సత్యసాయిబాబా పాఠశాలకు వచ్చి మూడవ పిరియడ్‌లో తరగతి గదిలో ఛాతిలో నొప్పిగా ఉందని కూలబడిపోయారు. దీంతో సహచర ఉపాధ్యాయులు స్థానిక ఆస్పత్రికి తరలించి సీపీఆర్ చేసి అంబులెన్స్‌లో అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సత్యసాయిబాబా మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాట్రేనిపాడు గ్రామానికి చెందిన ఆయన పొన్నమండ, కాట్రేనిపాడు, చింతలపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ఉపాధ్యాయుడు మృతి పట్ల ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, ఉపాధ్యాయ సంఘా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.